



కనకమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.,

మంచు కురిసే వేళలో...



చలి వణికిస్తోంది. నగర శివార్లలో రాత్రి తొమ్మిది గంటలకే మంచు తెరలు కమ్ముకొంటున్నాయి. తెల్ల వారుజాము ఆరు గంటల వరకు దట్టమైన మంచు కురుస్తోంది. ఈ వాతావరణాన్ని ఆస్వాదించడం కాస్త ఆనందం కలిగించినా ఆరోగ్యంపై మాత్రం ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శ్వాస సంబంధమైన ఇబ్బందులు ఉన్నవారు ఈ మంచులో బయటకు రాకుండా ఉండడమే ఉత్తమమని సూచిస్తున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కనకమ్మకు క్షీరాభిషేకం

- ఘనంగా ప్రారంభమైన మార్గశిర గురువారం పూజలు



మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం అర్ధరాత్రి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, స్వర్ణ కవచ అలంకరణ సేవలు జరిగాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి అభిషేకం చేసి, పూజలను ప్రారంభించారు. అప్పటికే క్యూలైన్లలో భారీ సంఖ్యలో బారులు తీరిన భక్తులకు పూజల అనంతరం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు.

ప్రైవేటుకు ఫ్లాట్ ఉత్పత్తుల తయారీ

టెండర్ విడుదల చేసిన స్టీల్ ప్లాంటు

- ఏదో మతలబు ఉందంటున్న కార్మిక వర్గాలు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):



స్టీల్ ప్లాంటు మరో కొత్త టెండర్ జారీచేసింది. ప్లాంటు సరఫరా చేసే బిల్లెట్లను వివిధ సైజుల్లో ఫ్లాట్లుగా కన్వర్షన్ చేసి ఇవ్వాలనేది ఈ టెండర్ ముఖ్య ఉద్దేశం. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఇప్పటివరకూ ఫ్లాట్ ఉత్పత్తులను తయారు చేయలేదు. రౌండ్స్ మాత్రమే చేస్తోంది. గతంలో స్టీల్‌ప్లాంటు విస్తరణకు వెళ్లినప్పుడు ఫ్లాట్ ఉత్పత్తుల తయారీకి అనుమతి కోరితే మంత్రిత్వ శాఖ అనుమతులు ఇవ్వలేదు. వాటిని ఇక్కడ తయారుచేస్తే ప్రైవేటు సంస్థలకు పోటీ అవుతుందని నిరాకరించినట్టు విమర్శలు ఉన్నాయి. ఫ్లాట్ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ... మిగతా 6వ పేజీలో

పట్టాలెక్కని అభివృద్ధి

మందకొడిగా రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించేందుకు 2022లో రూ.456 కోట్లు మంజూరు
- మూడేళ్ల క్రితం శంకుస్థాపన
- ఇప్పటికీ ఒక్కటి కూడా పూర్తికాని వైనం
- 14 ప్లాట్‌ఫారాలు, 36 లిఫ్టులు, 24 ఎస్కలేటర్లకు ప్రతిపాదనలు
- రివైజ్డ్ మాస్టర్ ప్లాన్ ఆమోదం కోసం ఎదురుచూపులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసుకున్న ఈ ప్రాజెక్టుకు అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో పాటే పనులు ప్రారంభమైన అనేక స్టేషన్లు అధునాతన వసతులతో సేవలు అందిస్తున్నాయి. విశాఖలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికీ రివైజ్డ్ మాస్టర్‌ప్లాన్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.



జ్ఞానాపురం వైపు ఏర్పాటుచేసిన బారికేడ్లు



నెలలుగా సాగుతున్న నిర్మాణపనులు

అమృత్ భారత్ పథకం కింద విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించాలని 2022లో రూ.456 కోట్లు మంజూరుచేశారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఎదురుకావడంతో వారు మధ్యలోనే పనులు ఆపేసి వెళ్లిపోయారు. కోర్టు కేసులు అన్నీ ముగించుకొని ఇటీవలె కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మాస్టర్ ప్లాన్‌లో కూడా మార్పులు చేశారు. రైల్వే జోన్ కార్యాలయం శంకుస్థాపనకు విశాఖపట్నం వచ్చిన రైల్వే బోర్డు ఛైర్మన్ రైల్వే స్టేషన్‌ను కూడా సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న స్టేషన్‌లో 8 ప్లాట్‌ఫారాలు ఉండగా ప్లాన్‌లో అదనంగా రెండు నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఛైర్మన్ అదనంగా మరో నాలుగు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని ఆదేశించారు. అదేవిధంగా లిఫ్టులు, ఎస్కలేటర్ల సంఖ్య పెంచాలని సూచించారు. దేశంలోని టాప్ 20 స్టేషన్లలో ఒకటిగా ఉన్న విశాఖ స్టేషన్‌ను ఆ స్థాయిలోనే అభివృద్ధి చేయాలని ఇంకా మరికొన్ని సూచనలు చేశారు. హౌరాలో ఉన్న విధంగా రైల్వే ట్రాక్‌ల మీదుగా 'ఎయిర్ కాంకోర్స్' నిర్మించాలని, అందులో ప్రయాణికులకు వసతులతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు షాపులు పెట్టాలని సూచించారు. వీటిని జోడించి రివైజ్డ్ మాస్టర్ ప్లాన్ పంపిస్తే దానికి ... మిగతా 6వ పేజీలో

అంచనాలు పక్కాగా..

అప్పుడే సత్ఫలితాలు

- నిధులను సక్రమంగా, సకాలంలో వినియోగించాలి
- జిల్లా అధికారులకు రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశం
- మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ మరమ్మతులకు నిధులు కోరిన కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు పక్కాగా రూపొందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను సక్రమంగా, సకాలంలో వినియోగించాలని అధికారులను రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా రూపొందించే అంచనాలతోనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. కమిటీ సభ్యులు ఏలూరి సాంబశివరావు, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వరుదు కల్యాణిలతో కలిసి బుధవారం జిల్లా పర్యటించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ విభాగాల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో స్థితిగతులు, చేపట్టిన ప్రాజెక్టుల గురించి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, విభాగాల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు మాట్లాడుతూ అంచనాలు రూపొందించే సమయంలో జాగ్రత్తగా ఉంటే పనులు చేపట్టే సమయంలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తవన్నారు. పనులు జరిగిన వెంటనే బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పలు కార్యక్రమాలు చేపడుతోందని, అవి ప్రజలకు చేరువయ్యేలా అధికారులు కృషిచేయాలని కోరారు. సభ్యుడు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో అమలు చేస్తున్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాల్సి ఉందన్నారు. మరో సభ్యుడు మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో సచివాలయ, డీఆర్‌డీఏ ... మిగతా 6వ పేజీలో

దూరవిద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

కొత్తవలస ప్రగతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అక్రమాలు

- ఒక్కో విద్యార్థి నుంచి నాలుగు వేల నుంచి పది వేల రూపాయల వరకూ వసూలు
- ముందుగానే విద్యార్థుల చేతికి ప్రశ్నపత్రం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విద్యార్థుల చిట్‌చాట్
- స్క్వాడ్‌ను పంపించామన్న డైరెక్టర్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. తమ వద్ద పరీక్షలు రాస్తున్న విద్యార్థుల నుంచి కొన్ని కాలేజీల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేసి, ప్రశ్నపత్రాన్ని ముందుగానే లీక్ చేస్తున్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఈ విధంగా వ్యవహరించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో విద్యార్థి నుంచి నాలుగు వేలు నుంచి పది వేల రూపాయల వరకూ వసూలు



మాస్ కాపీయింగ్ జరుగుతున్న ప్రగతి డిగ్రీ కళాశాల, (ఇన్‌సెట్‌లో) సమాధానాలతో కూడిన జెరాక్స్ కాపీలు

చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి కొందరు విద్యార్థులు ప్రగతి కాలేజీ పరీక్షా కేంద్రం ఎదురుగా ఉన్న జెరాక్స్ సెంటర్ వద్ద మాట్లాడుకుంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పరీక్షకు నాలుగు వేల రూపాయలు చెల్లించినట్టు ఒక అభ్యర్థి చెప్పగా, ఎవరి ద్వారా ఫీజు చెల్లించారో ఆ వీడియోలో విద్యార్థులు చర్చించుకుంటూ కనిపించారు. ఈ వీడియో బయటకు రావడంతో మరోసారి దూరవిద్య పరీక్షల నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ తరహా మాస్‌కాపీయింగ్‌కు సహకరించిన కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఏయూ దూరవిద్య కేంద్రం బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీఏ ... మిగతా 6వ పేజీలో

కుమార్తె పెళ్లి ఆగిపోవడంతో తండ్రి ఆత్మహత్య

మృతుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి



ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పెళ్లి ఆగిపోవడంతో మనస్తాపానికి గురై రియల్ ఎస్టేట్ వ్యాపారి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి తల్లి పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ర్యాలీ శ్రీనివాసరావు (57) అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. భార్య, కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటుండగా, శ్రీనివాసరావు మాత్రం తన తల్లి సత్యవతితో కలిసి పీఎం పాలెంలోని ఐబీఆర్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు అప్పుడప్పుడు హైదరాబాద్‌లోని భార్యాపిల్లలు వద్దకు వెళ్లి వస్తుంటారు. ఆయన కుమార్తె హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తోంది. ఆమెకు పెందుర్తి సమీపంలోని చినముషిడివాడకు చెందిన బోని శ్రీనివాసరావు కుమారుడి (బ్యాంకు ఉద్యోగి)తో ఈ ఏడాది మార్చిలో పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 25న వివాహం చేయాలని ... మిగతా 6వ పేజీలో

రేషన్ డిపోల్లో సీసీ కెమెరాలు

బియ్యం విక్రయాలకు చెక్ చెప్పేందుకు ఉన్నతాధికారుల నిర్ణయం

- తొలుత నెల్లూరు జిల్లాలో ఏర్పాటు
- అక్కడ పనితీరు మదించిన తరువాత మిగిలిన జిల్లాల్లో...
- ముందు గోదాముల్లో ఏర్పాటుచేయాలంటున్న డీలర్లు



విశాఖపట్నం/గాజువాక/ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టడానికి పౌర సరఫరాల శాఖ కొత్త ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చింది. ప్రతి రేషన్ డిపోలో సీసీ కెమెరాలు అమర్చాలని ప్రతిపాదించింది. తొలుత నెల్లూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. రెండు, మూడు నెలల్లో అన్ని జిల్లాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పౌర సరఫరాల శాఖ సర్వర్‌కు అనుసంధానం చేస్తారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ల ప్రతినిధులు ఇటీవల పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసినప్పుడు ఈ విషయం చర్చకు వచ్చింది.

ప్రభుత్వం కిలో బియ్యం రూ.46 చొప్పున కొనుగోలు చేసి డిపోల ద్వారా కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే పౌర సరఫరాల శాఖ సరఫరా చేసే బియ్యం వినియోగించేందుకు కార్డుదారుల్లో అత్యధికులు విముఖత చూపుతున్నారు. డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి కిలోకు రూ.12 నుంచి రూ.15 సొమ్ములు తీసుకుంటున్నారు. డీలర్లు ఆ బియ్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారానికి తెరదించాలని మంత్రిని అధికారులు కోరారు. డిపోల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే బియ్యానికి బదులు సొమ్ములు తీసుకునే ప్రక్రియకు చెక్ పడుతుందని సూచించారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలని అధికారులు ప్రతిపాదించగా నెల్లూరు జిల్లాలో డీలర్లు ముందుకు వచ్చారు. ఆ జిల్లాలోని అన్ని డిపోల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు తరువాత పనితీరును మదించి మిగిలిన జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

రేషన్ డిపోల్లో సీసీ కెమెరాల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ముందుగా పౌర సరఫరాల సంస్థ గోదాముల్లో పెట్టాలని డీలర్లు ... మిగతా 6వ పేజీలో

ఏయూ వెబ్‌సైట్‌లో తప్పులు

విదేశీ విద్యార్థుల వ్యవహారాల విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.పాల్ డగ్లస్ కాగా ధనుంజయరావు పేరు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తప్పులు దొర్లుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ ఎస్.పాల్ డగ్లస్ వ్యవహరిస్తున్నారు. విదేశీ విద్యార్థుల వ్యవహారాల విభాగ పేజీ ఓపెన్ చేసిన వెంటనే ఆయన ఫొటోతో వివరాలు ఉన్నాయి. అయితే, పేజీ కిందకు వెళితే కాంటాక్టు వివరాల్లో ప్రస్తుత డీన్, అసోసియేట్ డీన్లకు సంబంధించిన వివరాలకు బదులుగా పూర్వ డీన్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు పేరు, ఫోన్ నంబర్, అలాగే, పూర్వ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్‌కుమార్ పేరు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత అసోసియేట్ డీన్లు ఎవరన్న వివరాలు ఈ పేజీలో లేవు. వర్సిటీలో ప్రతిష్టాత్మకంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్న తరుణంలో కనీసం ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ పేజీని కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఒక డీన్, ఒక అసోసియేట్ డీన్ మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఒక డీన్, ఇద్దరు అసోసియేట్ డీన్లు ఉన్నప్పటికీ వెబ్‌సైట్‌లో మార్పులేదు.



స్వామివారి సన్నిధిలో అంచనాల కమిటీ సభ్యులు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామిని రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, ఏలూరి సాంబశివరావు, గణబాబు, గంటా శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ సుజాత, ఏఈఓ తిరుమలేశ్వరరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. ప్రముఖులంతా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో అర్చకులు వారి గోత్రనామాలతో పూజలు చేసి, శేషవస్త్రాలను పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువలతో సత్కరించి స్వామి ఫొటోలను అందజేశారు.

సామాజిక కార్యకర్తకు సన్మానం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద విద్యార్థులకు, వృద్ధ మహిళలకు, అనాథలకు సాయి సంహిత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న స్థానిక జీవీఎంసీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఆర్. అప్పలరాజును విశాఖలోని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంస్థ జాతీయ చైర్మన్ రామకృష్ణ అధ్యక్షత వహించారు.

కేజీబీవీ విద్యార్థినులకు వనభోజనాలు

భీమునిపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెం కేజీబీవీ విద్యార్థినులకు సమీపంలోని సీతారామరాజు మామిడి తోటలో బుధవారం వనసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బాలికలు ఆట పాటలతో సందడిగా గడిపారు. మెజీషియన్ రవి ప్రదర్శనలు, రాజాబాబు డ్యాన్స్ ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపాల్ గంగాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కుమార్, గంటా నూకరాజు, రాజేటి బసవ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంగివలస రోడ్డు వివాదంపై విచారణ

తగరపువలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలోని సంగివలస రహదారి వివాదాన్ని సుమోటాగా స్వీకరిస్తున్నామని ఆర్డీఓ సంగీత్ మాథుర్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన లేఖ విడుదల చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న మట్టి రహదారి జిరాయితీలో ఉందని, అది తమకే చెందుతుందని కొంత మంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మరికొందరు రహదారిగానే ఉంచాలని కలెక్టరును కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ రామారావు ఇరువర్గాలను విచారించి ఆర్డీఓకి నివేదిక ఇచ్చారు. ఈమేరకు ఆర్డీఓ ఈ సమస్యను సుమోటో రివిజన్ పిటిషన్‌గా స్వీకరించామని, అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ/11కేవీ పెద్దిపాలెం, బోని ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆనందపురం పరిసర ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనందపురం, బిపి కల్లాలు, పొడుగుపాలెం, కుసులవాడ, జగన్నాథపురం, వెంకటాపురం, చందక, గొట్టిపల్లి, చిన్నయ్యపాలెం, రామునాయునిపేట, రేగనిగూడెం, ముకుందపురం కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

భీమునిపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు బుధవారం ఎలింకో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని పిల్లలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నీరజ మాట్లాడుతూ శిబిరంలో గుర్తించిన పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వీల్ చైర్లు, సీపీ చైర్లు, హియరింగ్ హెడ్స్, అందిస్తుందన్నారు.



భీమునిపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు



తాళ్లవలస ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులకు సన్మానం

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

- పౌరులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి
- రాజ్యాంగ దినోత్సవంలో వక్తలు
- విద్యా సంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా వేడుకలు



సాగర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు



భీమునిపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని విద్యా సంస్థలు, కార్యాలయాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రతి పౌరునికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని, పౌరులు హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.రమణ ఆధ్వర్యంలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మధురవాడలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.వాంబేకాలనీ, మిథిలాపురి వుడాకాలనీ, పాత మధురవాడ మెట్ట, మధురవాడ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులు రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించారు. రాజ్యాంగంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లోని విజేతలకు బహుమతులు ఇచ్చారు.

తగరపువలసలో...

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, న్యాయ, భావ ప్రకటన హక్కులు రాజ్యాంగం ద్వారా లభించాయన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు రాజ్యాంగ పీఠికను పఠించారు. అంతకముందు కళాశాల నుంచి తగరపువలస కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. బి. స్వర్ణలత, డా. బి. సుదంశా, సీతంనాయుడు, నాగరాజు, నారినాయుడు, హరికృష్ణ, సౌజన్య పాల్గొన్నారు. చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ చిట్టిబాబు, వీడీ అచ్చుతరావు పాల్గొన్నారు. భీమిలి మండలంలోని తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంటు నిర్వహించారు. ప్రధాని ఎన్నిక, పార్లమెంట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజురెడ్డి, జె. అప్పలనాయుడు, ఎం. నరసింగరావు, సిద్దార్థ, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

గీతంలో...

సాగర్‌నగర్ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యాయ కళాశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ. రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె. ప్రతిమ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ మధుసూదనరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టత, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం భారత ప్రభుత్వ అధికారిక పోర్టల్ ద్వారా నిర్వహించిన రాజ్యాంగ ప్రజాస్వామ్యం క్విజ్ పోటీలో విజేతలకు అతిథులు బహుమతులు,సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాథమిక హక్కులకు మార్పు అన్న అంశంపై మాక్ లోక్‌సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్వీజీ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివ సత్యనారాయణ పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం రూరల్ : ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆయన రెడ్డిపల్లి సచివాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం దేశ పౌరలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి గొప్ప విలువలను అందించిందన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గిరిబాబు, నాయకులు ఈర్ల ఈశ్వరరావు, ఆదిబాబు, బంగారప్పడు, మురళీరాజు, బుగత సత్యనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో...

సాగర్‌నగర్ : సాగర్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 8వ వార్డు వైసీపీ అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. పీఎంపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, టీడీపీ నాయకులు కొల్లి బాబ్జీపోతినాయుడు, వర్మ తదితరులు పాల్గొన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం విశిష్టతను తెలియజేసి, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వెంకట్రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొమ్మాది : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

మధురవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వతంత్రనగర్ కాలనీలోని శ్రీలక్ష్మీదేవి ఆలయం వద్ద ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు.స్వామివారికి పాలు, పన్నీరు, తేనెతో అభిషేకం చేశారు. మానం ఆంజనేయనగర్ కాలనీలోని లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహా కామేశ్వరస్వామి ఆలయంలో కూడా పూజలు జరిగాయి.

భీమునిపట్నం : పట్టణంలోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు జరిగాయి. దాసా ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు వంశీ మోహన చెన్న కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కొమ్మాది : అష్టలక్ష్మీ దేవాలయం ఆవరణలో ఉన్న వైశాఖేశ్వరస్వామి ఆలయంలో బాల సుబ్రహ్మణ్యం, జంట నాగబంధం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద షిర్డీ పద్మ సాయి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రైతన్న మీ కోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన గొట్టిపల్లి పంచాయతీలోని చీమలమెట్టపాలెంలో పర్యటించారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలు గురించి ఆరా తీశారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు కింద రెండు విడతలుగా ఇచ్చిన రూ. 14 వేలు ఖాతాల్లో జమ అయ్యాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అధిక పంట దిగుబడి కోసం వ్యవసాయ అధికారులు అందజేస్తున్న సలహాల గురించి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతులు తాము పండించే పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే స్వేచ్ఛ రావాలని ఆకాంక్షించారు. అనంతరం వ్యవసాయ రంగాన్ని అగ్రస్థానంలో నిలపడానికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ కురుమిన రామస్వామినాయుడు, కూటమి నాయకులు నాయుడు, పాండ్రంగి అప్పలరాజు, జనసేన 8వ వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్, గంట్రెడ్డి సోమినాయుడు, రౌతు నాగరాజు, కర్రి శ్రీనివాస్, కోరాడ వైకుంఠం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ, జూడో పోటీలకు ఎంపికయ్యారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్ - 14, అండర్ - 17 విభాగాల్లో బాల, బాలికలకు రగ్బీ, జూడో పోటీలు జరిగాయి. వీటిలో సన్ స్కూల్‌కు చెందిన ఎన్. సాత్విక్ రామ్, బి. హర్షిత రగ్బీలోను,సీహెచ్. గుణ సాత్విక్, టి. ప్రియ మనశ్విని జూడో పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు నెల్లూరు జిల్లా పొదలకూడూరు హైస్కూల్‌లో జరిగే రగ్బీ, సత్యసాయి జిల్లా చిగిచెర్ల ధర్మవరం హైస్కూల్‌లో జరిగే జూడో పోటీల్లో వారు పాల్గొనున్నట్టు చెప్పారు.

వెంకన్న సన్నిధిలో శ్రవణ నక్షత్ర హవనం

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి కొండదిగువన స్వామివారి పూదోటలో కొలువుదీరిన పద్మావతి, అలిమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తరువాత యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై ఉంచారు. శాస్త్ర విధానంలో మండపారాధన, బింబారాధన, కలశారాధన పూర్తి చేసి ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. తొలుత పంచ సూక్తాలతో, తరువాత సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనం చేసి పూర్ణాహుతి సమర్పించారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

పద్మనాభం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెడ్డిపల్లి గ్రామంలో పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, మండల యూత్ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరిగుడి ఆదిబాబు, న్యాయవాది ఈర్ల ఈశ్వరరావు, నాయకులు బంగారప్పడు, సన్యాశినాయుడు, గంధవరం సర్పంచ్ మురళీరాజు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో సీసీ కెమెరాలు

... 5వ పేజీ తరువాయి

కోరుతున్నారు. పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి ప్రతి నెలా సరకులను డిపోలకు సరఫరా చేస్తారు. అయితే ప్రతి బస్తాలో కిలో నుంచి రెండు కిలోల బియ్యం తక్కువగా ఉంటున్నట్టు డీలర్లు చెబుతున్నారు. అందువల్ల తొలుత గోదాముల్లో అక్రమాలు అరికట్టేందుకు అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని డీలర్లు కోరుతున్నారు. అలాగే డీలర్లకు ప్రతి కిలోకు ఇప్పుడు ఇస్తున్న రూపాయి కమీషన్‌ను మూడు రూపాయలకు పెంచాలని అడుగుతున్నారు. అక్రమ బియ్యం కొనుగోలు చేసే రైస్ మిల్లుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.



ఎమ్మెల్యే గంటాకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అధికారులు

వివాదాలకు కేరాఫ్‌గా సింహాచలం దేవస్థానం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, తక్షణమే ప్రక్షాళన అవసరమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన సింహాచలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానంలో జరుగుతున్న విషయాలన్నీ ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా చర్చించనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఆలయానికి శాశ్వత ఈఓను నియమించాల్సి ఉందన్నారు. దేవస్థానం పరిపాలనలో గత వైసీపీ ప్రభుత్వ అవశేషాలు ఇంకా ఉన్నాయని, ప్రధానంగా దాతలిచ్చే విరాళాలు, ఆభరణాలపై వివాదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తులకు సింహగిరిపై వసతి సౌకర్యం లేకపోవడం శోచనీయమన్నారు. అనంతరం సింహగిరిపై లోవతోటలో, కొండదిగువ తొలిపావంచా వద్ద రూ. 95 లక్షలతో జరిగే అభివృద్ధి పనులకు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పివి నరసింహంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

ప్రైవేటుకు ప్లాట్ ఉత్పత్తుల తయారీ

... 5వ పేజీ తరువాయి

ఎక్కువ. మంచి రేటు కూడా లభిస్తుంది. ఇక్కడే యంత్ర పరికరాలకు చిన్న చిన్న మార్పులు చేసుకుంటే వాటిని ఉత్పత్తి చేయవచ్చు. కానీ ఎవరికో లబ్ధి చేకూర్చడానికి ఈ టెండర్లు పిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతా, రూర్కెలాలో ఉండేవారు ఈ ప్లాట్లు కన్వర్షన్ చేయాలని స్టీల్ ప్లాంటు ప్రకటన జారీచేసింది. కనీసం ఏడాదికి ఆరు వేల టన్నుల బిల్లెట్లను కన్వర్షన్ చేయాలనేది నిబంధన. ఏడాదికి సగటున రూ.84 లక్షల టర్నోవర్‌తో మూడేళ్లు వ్యాపారం చేసి ఉండాలని పేర్కొన్నారు. ఫ్లాట్ల తయారీ మంచి నిర్ణయమే కానీ వాటిని ఇక్కడ తయారు చేయకుండా వేరే వారికి ఇవ్వడం వెనుక ఏదో మతలబు ఉందని ఉద్యోగ వర్గాలు అనుమానిస్తున్నాయి. కొద్దినెలల క్రితం ప్లాంటులో వైర్ రాడ్ మిల్లు ఉండగా, వాటిని తయారు చేయడానికి కూడా ఇలాగే ఒక సంస్థకు మూడేళ్ల కాంట్రాక్టు రూ.200 కోట్లకు ఇచ్చారు.

పట్టాలెక్కని అభివృద్ధి!

... 5వ పేజీ తరువాయి

ఆమోదం ఇస్తామని చెప్పారు. దాంతో 14 ప్లాట్‌ఫారాలతో కొత్త ప్లాన్ పంపించారు. ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు.

యార్డ్ రీ మోడలింగ్

కొత్త ప్రతిపాదనల్లో రైల్వే యార్డ్‌ను ఆధునికీకరిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్లకు సౌలభ్యంగా ఉండేలా, రైళ్లు వచ్చి, పోయేందుకు అనువుగా యార్డ్‌లో మార్పులు చేస్తారు. అదేవిధంగా 20 ఎస్కలేటర్లు, 20 లిఫ్ట్‌లకు బదులుగా 36 లిఫ్ట్‌లు, 24 ఎస్కలేటర్లకు ప్రతిపాదించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ర్యాంపుల నిర్మాణాలు జోడించారు. ఈ మార్పులకు ఆమోదం లభించిన వెంటనే పనులు వేగవంతం చేసి 18 నెలల్లో పూర్తిచేసి 2027లో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

'అంచనాలు' పక్కాగా...

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులతో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు భాగస్వామ్యులైతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వరుదు కల్యాణి మాట్లాడుతూ కేజీహెచ్‌లో ఇటీవల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడానికి గల కారణాలేమిటని ప్రశ్నించారు. అక్కడ సరిపడా జనరేటర్లు లేవా? అని అధికారులను అడిగారు. సంబంధిత అధికారులు వివరాలు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఉందని, దానికింద ఆయకట్టు అంతగా లేదని, అందువల్ల జీవీఎంసీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నామన్నారు. రిజర్వాయర్ మరమ్మతులకు తగిన నిధులు ఇవ్వాలని కోరారు. ఈసమావేశంలో శాసనసభ డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ సుధాసాగర్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

... 5వ పేజీ తరువాయి

ఎంసీఏ కోర్సులకు సంబంధించి మొదటి, రెండు, మూడో సెమిస్టర్‌లతోపాటు 2019 నుంచి గత విద్యా సంవత్సరం వరకూ ఉన్న బ్యాక్‌లాగ్స్‌కు ఈ నెల 25 నుంచి పరీక్షలు నిర్వహిస్తోంది. ఇటు శ్రీకాకుళం నుంచి అటు గుంతకల్లు వరకూ 78 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. పరీక్షలకు పది వేల మందికి పైగా హాజరవుతున్నారు. అయితే పరీక్ష కేంద్రాలుగా ఉన్న కొన్ని కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నాయి. కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ నిర్వాహకులు డబ్బులు చెల్లించిన విద్యార్థులకు మాత్రమే ప్రశ్నపత్రాలను పంపినట్టు తెలిసింది. అదేవిధంగా వారందరినీ ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చోబెట్టి పరీక్షలు రాయించినట్టు చెబుతున్నారు. విద్యార్థులు ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాసిన వెంటనే మైక్రో జెరాక్స్‌లను అక్కడ నుంచి తీసుకువెళ్లేలా ఆయాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. పరీక్ష ప్రారంభమైన గంట మాత్రం జాగ్రత్తగా ఉండాలని, ఆ తరువాత మైక్రోజెరాక్స్‌లు తీసుకుని రాసుకోవాలని చెప్పినట్టు చెబుతున్నారు. ఇకపోతే, ఇదే కాలేజీకి చెందిన బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులకు సంబంధించి కూడా సెల్ఫ్ సెంటర్‌ను వేయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. దూరవిద్యకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు కాస్త ముందు పంపినట్టయితే అక్రమాలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం

డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, తనిఖీలు నిర్వహిస్తున్నామని దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలను ఏయూ నుంచి వెళ్లిన స్క్వాడ్ తనిఖీ చేయగా, ఎనిమిది మంది విద్యార్థులు పట్టుబడ్డారన్నారు. వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. అందులో ఏడుగురు చూచిరాస్తుండగా, ఇంకొకరు...వేరొకరి బదులు పరీక్ష రాస్తున్నట్టు గుర్తించడం జరిగిందన్నారు.

దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ డీఏ నాయుడు

కుమార్తె పెళ్లి ఆగిపోవడంతో తండ్రి ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

ముహూర్తం పెట్టుకున్నారు. కుమార్తె పెళ్లికి సంబంధించి బంధువులు, స్నేహితులకు కార్డులు పంపిణీ చేయడంతోపాటు ఏర్పాట్లన్నీ శ్రీనివాసరావు పూర్తిచేశారు. ఇంతలో ఏమైందోగానీ పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్టు పెళ్లి కుమారుడి తరఫువాళ్లు శ్రీనివాసరావుకు చెప్పారు. దీంతో ఆయన పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లి పెళ్లి రద్దు చేసుకోవద్దని కాళ్లావేళ్లాపడి వేడుకున్నారు. కానీ వారి నిర్ణయం మారకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. విజయనగరంలో పెళ్లికి వెళుతున్నానని తల్లికి చెప్పి మంగళవారం (ఈనెల 25) రాత్రి ఏడు గంటల సమయంలో శ్రీనివాసరావు ఇంటి నుంచి బయటకు వచ్చిన చేరలేదు. బుధవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఒకరు సత్యవతికి ఫోన్ చేసి 'మీ కుమారుడి కారు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద సర్వీసు రోడ్డులో ఉంది. ఆయన చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉందని' సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె గాజువాకలో ఉంటున్న తన అల్లుడు, కుమారుడి బావమరిదికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వెళ్లారు. కాగా శ్రీనివాసరావు తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యానని హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడితోపాటు గాజువాకలో ఉంటున్న సోదరి భర్త, తన బావమరిదికి, స్నేహితుడికి సూసైడ్‌నోట్‌ను వాట్సాప్‌లో పంపించారు. మృతుడు శ్రీనివాసరావు తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

పటిష్ఠ రాజ్యాంగం వల్లే భారత్‌కు విశిష్ట గుర్తింపు

» ఏయూ వీసీ రాజశేఖర్ » పలు చోట్ల రాజ్యాంగ ఆమోద దినోత్సవం » డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళి

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠ రాజ్యాంగంతోనే భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు లభించిందని ఎయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రతి సమస్యకు సానుకూలపరిష్కారం చూపే విధంగా రాజ్యాంగం ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ పి.కింగ్, ఆచార్యులు కె.జాన్, సీహెచ్ ఆశా ఇమ్మానియేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, పలు ప్రొఫెసర్లు, వర్సిటీ ఉద్యోగులు

ఆరిలోవలో..

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విమ్స్ ఆస్పత్రిలో బుధవారం వేడుకలు నిర్వహించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబు ఆస్పత్రిలో గల సెమినార్ హాలులో డాక్టర్ బి ఆంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైద్యులు, ఆస్పత్రి అధికారులు, సిబ్బందితో కలసి రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో విమ్స్ డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాసకుమార్ తదితరులు, పలువురు వైద్యులు, ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి దర్మారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఎఎస్ఈలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో కూడా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇగ్నో అదనపు సంచాలకుడు ఇ.కృష్ణారావు, విభాగాధికారి వివి పతిరావునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.



ఆరిలోవ : విమ్స్‌లో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యులు

బీజేపీ నగర కార్యాలయంలో..

పెదవాల్తేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ మూలాల్ని స్మరించుకొని, రాజ్యాంగం పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్‌రాజు, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గన్‌రెడ్డి రాకేష్ చంద్ర, బీజేపీ పార్వతీపురం ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిదాడి రమేష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నేతలు సురేష్‌బాబు, విజయబాబు, కోడూరు సంజీవరావు, రాంబాబు, జామి శ్రీనివాస్, మురళీ మోహన్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మద్దిలపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ రాజ్యంగ కమిటీ సభ్యులు 1949, నవంబరు 26న తొలి ముసాయిదా ప్రతులపై సంతకాలు చేశారని తెలిపారు. అందుకే ప్రతి ఏడాది నవంబరు 26న రాజ్యంగ దినోత్సవాన్ని జరుపుకుంటామని వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందించడమే రాజ్యంగ మౌలిక లక్ష్యమన్నారు. రాజ్యంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ కృషిని కొనియాడారు. విద్యార్థులు చట్టాలు, హక్కులు, బాధ్యతలు తెలుసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు రాజ్యంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సన్యాసిరావు, మురళీకృష్ణ, సూర్యకుమారి పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో ఆకట్టుకున్న గురుకుల విద్యార్థి యోగి

ఆరిలోవ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విశాఖ జిల్లా శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో 9వ తరగతి చదువుతున్న కె.యోగి ప్రాతినిధ్యం వహించాడు. డెప్యూటీ సీఎంగా సభలో పాల్గొంటూ గిరిజన ప్రాంతంలోని సమస్యల గురించి వివరంగా ప్రసంగించాడు.ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ మాక్ అసెంబ్లీ జరగడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థి యోగిని పలువురు అభినందించారు.



మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న యోగి

రోడ్లపై పశువుల సంచారంతో ఇబ్బందులు



రోడ్లపైనే తిష్ఠ వేసిన పశువులు

మధురవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు రోడ్లపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.

మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, నగరంపాలెం రహదారి, ఐటీ రోడ్ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. రోడ్లపై పశువుల సంచారం వల్ల ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫుట్‌పాత్ నుంచి అకస్మాత్తుగా రోడ్ల పైకి వస్తుండడంతో వాహనదారులు వాటిని ఢీకొని అదుపు తప్పి పడిపోతున్నారు. అధికారులు ఈ విషయమై దృష్టిసారించి, సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 50, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 30, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 56, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

పీఠం కోసం అయ్యప్ప విగ్రహం బహూకరణ



అయ్యప్ప విగ్రహం అందజేస్తున్న వాణి, భాస్కర్, సుష్మాబాబుజీ, పద్మ

రామ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఊటగడ్డలోని శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద కొలువైయున్న శ్రీహరిహర నందన పీఠంలో ఏర్పాటుకు యెరుబండివాణి, భాస్కర్, సుష్మా బాబుజీ, బి.పద్మ తదితరులు అయ్యప్ప స్వామి విగ్రహాన్ని అందించారు. పీఠాదిపతి మురళీకృష్ణ, భరత్ గురుస్వాములు చేతుల మీదుగా స్వామిని ప్రతిష్ఠించి అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీ-20 పనులపై విజిలెన్స్ విచారణ

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీ-20 సదస్సు సందర్భంగా 2023లో జీవీఎంసీ చేపట్టిన సుందరీకరణ పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆయా పనులపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విచారణకు అనుమతించిందని, ఆయా పనులను పరిశీలిచేందుకు సంబధిత అధికారులను తమకు సహకరించేలా ఆదేశించాలని జీవీఎంసీ కమిషనర్‌కువిజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ కె.ప్రభాకర్ లేఖ రాశారు.

కార్మిక వర్గాలను విడదీసేందుకు కుట్ర

» ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గాలను విడదీసేందుకు కుట్ర జరగుతోందని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. లేబర్ కోడ్స్ అమలు చేసిన క్రమంలో వీటిని నిరసిస్తూ బుధవారం ప్లాంటు అడ్మిన్ భవన మార్గంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గంపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్మిక వర్గమే దేశ ఆర్థిక ప్రగతికి మూలమని గుర్తించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

» వేకువ జాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్త'జనం' » ప్రత్యేక పూజలు, అభిషేకాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్యసాయి ప్రేమ సదన్‌లో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. మండపారాధన, హోమం, పూర్ణాహుతి వంటి పూజలను చేశారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీవేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఆర్వీయనమలయ్య కేజీన్నర బరువు గల వెండి పళ్లాన్ని స్వామి వారికి బహుమతిగా అందించారు.



ఎంవీపీ కాలనీ : సత్యసాయి ప్రేమసదన్‌లో కొలువైన సుబ్రహ్మణ్యస్వామి



వెంకోజీపాలెం : ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య స్వామి షష్టిని పురస్కరించుకిని బుధవారం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసియున్న శివలింగం, నాగదేవత సహిత సుబ్రహ్మణ్య స్వామికి బుధవారం తెల్లవారు జాము 2.30 గంటల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. భక్తులు స్వయంగా తాము తీసుకొచ్చిన పాలు, పెరుగు, పంచదార, తేనే, పండ్ల రసాలు వంటి పంచామృతాలతో స్వామి వారికి స్వయంగా అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్‌కిరణ్‌జగదీష్ మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప మాలదారులకు మహా అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరిలోవలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో గల పలు దేవాలయాల్లో భక్తులు బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాత డెయిరీ ఫారం వద్ద గల సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెలగపూడ రామకృష్ణబాబు తనయుడు, టీడీపీ యువ నేత ప్రతాపరుద్ర, టీడీపీ 10 వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, కూటమి నేతలు పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఇదే వార్డులోని ఆదర్శనగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేకంగా పంచామృతాలతో పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ట్రస్టీ బండి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. చినగదిలినార్త్ షిర్డి సాయిబాబా ఆలయంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏపీ ఫైబర్ వినియోగదారుల ఇక్కట్లు

» ఎప్పటికప్పుడే ప్రసారాలకు అంతరాయం » సక్రమంగా సేవలు అందించని ఆపరేటర్లు

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అతి తక్కువ ధరలో ప్రసారమాధ్యామాలు, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాన్ని కల్పించాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఏపీ ఫైబర్‌నెట్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీస ధర నెలకు రూ.350లు చెల్లించి కొన్ని చాన్నల్స్ మినిమమ్ వేగంతో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంపై వినియోగదారులు ఒకవైపు ఆనందం వ్యక్తం చేస్తున్నా, మరోవైపు స్థానిక నిర్వాహకుల నిర్లక్ష్య ధోరణితో నెలకు 15 రోజులు ప్రసారాలు నిలిచిపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రసారాల్లో అంతరాయం కలగడం, ఇతర ఫైబర్‌నెట్‌లలో ఎటువంటి అంతరాయం లేకపోవడంతో వినియోగదారులు తమ కేబుల్ ఆపరేటర్లలను నిలదీస్తున్నారు. అయితే తమ వైపు ఎటువంటి సమస్య లేదని, ఏపీ ఫైబర్ కేంద్రం నుంచి (సీతమ్మధార ఎమ్మార్వో కార్యాలయం వద్దనున్న ఏపీఫైబర్ జిల్లా ఇన్‌చార్జి కార్యాలయం) సమస్య ఉందని చెబుతున్నారు. ప్రైవేటు నిర్వాహకుల వలే ఏపీ ఫైబర్ నిర్వాహకులు తమకు సహకరించడం లేదని. దానివల్ల వినియోగదారులకు మెరుగైన ప్రసారాలను అందించలేకపోతున్నామని కేబుల్ ఆపరేటర్లు వెల్లడిస్తున్నారు. కొన్నిచోట్ల ఏపీ ఫైబర్ ప్రసారాలు సరిగా రానప్పుడు సదరు కేబుల్ ఆపరేటర్లను సంప్రదిస్తుంటే సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు కొన్నిసార్లు తమపై విరుచుకు పడుతున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినియోగదారులు కోరుతున్నారు.

నేటి నుంచి 'జాతీయ దత్తత అవగాహన సదస్సు'

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతులకు పిల్లల దత్తతపై అవగాహన పెంచేందుకు రాష్ట్రంలో నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్-2025 (జాతీయ దత్తత అవగాహన సదస్సు) నిర్వహించనున్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సహకారంతో ఈ నెల 27, 28వ తేదీల్లో నగరంలో కార్యక్రమం జరగనుంది. సదస్సులో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు తమ జీవిత అనుభవాలను పంచుకుంటారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. విమ్స్‌కు సంబంధించి 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ మరమ్మత్తుల పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు నరికి వేత, లైన్ మరమ్మత్తులు చేపడతుండడంతో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఇందిరానగర్, రాజీవ్ నగర్, ఆదర్శనగర్, సుందరనగర్, రవీంద్రనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు.

రెల్లి వీధిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న టీడీపీ నేతలు పి.కుమార్, పీతల అమరేంద్ర రాజారావు తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని చినవాల్తేరు రెల్లివీధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూసర్వసత్తాక, సార్వభౌమత్వాధికారం ఉన్న పటిష్ఠ రాజ్యాంగం మనదన్నారు. దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన కరదీపిక రాజ్యంగమన్నారు. రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ పోడుగు కుమార్, నీలపు వెంకటేశ్వరరావు, గండేటి కిరణ్‌కుమార్, టీడీపీ 21వ వార్డు నాయకులు పీతల అమరేంద్ర, దన్నాన రాజారావు, ఏవీ రమేష్‌కుమార్, పి.జితేంద్ర, గుంటుబోయిన మూర్తి యాదవ్, పీతల అవినాష్ యాదవ్, నక్క వినయ్, ఇసుకపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువ వైద్యులకు శస్త్రచికిత్సపై శిక్షణ

ఎండాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాన్సన్ అండ్ జాన్సన్ సహకారంతో ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ స్కిల్స్ మొబైల్ శిక్షణ కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక బస్సులో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌లో యువ వైద్యులకు, వైద్య విద్యార్థులకు ల్యాప్రో స్కోపిక్ సర్జరీపై శిక్షణ అందిస్తున్నారు. ఒకప్పుడు శస్త్ర చికిత్సలో నైపుణ్యం పొందాలంటే పెద్ద ఆసుపత్రులు కాని, నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం వీల్స్ ఆన్ స్కిల్స్ బస్సు వైద్య విద్యాలయాల్లో ఊరురా తిరుగుతోంది. ఈ బస్సు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్‌తో రూపొందించబడింది. యువ వైద్యులు, వైద్య విద్యార్థులకు అధునాతన ల్యాప్రో స్కోపిక్ శస్త్ర చికిత్సపై శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న వైద్యులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం పొందుతున్నారు.

టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన గంగరాజు, ఇతర కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డుకు చెందిన సాయిరాం క్యాటరింగ్ అధినేత కాకి గంగరాజు బుధవారం 200 మంది కార్యకర్తలతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి టీడీపీ కండువాలు వేసి గంగరాజుతో పాటు కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గంగరాజు చేరికతో ఆరిలోవ ప్రాంతంలో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమపాలనతో టీడీపీ పట్ల ప్రజల్లో మొగ్గు పెరిగేలా చేస్తోందన్నారు. సుమారు రూ.120 కోట్లతో ఈ ప్రాంతంలో తాగునీరు ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నామన్నారు. కొత్తగా పింఛన్ల కోసం జనవరి 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సింహచలం దేవస్థానం భూ సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం కేటరింగ్ రాజు మాట్లాడుతూ పార్టీ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన కూటమి నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

37 మంది పోలీసులకు బదిలీలు

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 37 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురు ఏఎస్ఐలు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 24 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కొత్త స్టేషన్లలో వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా డస్ట్‌బిన్లు

» ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



కాకతీయ కన్వెన్షన్ హాల్ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న డస్ట్‌బిన్

మద్దిలపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు వాహనదారులకు తలనొప్పిగా మారాయి. రహదారి మధ్యలో ఉన్నట్టుగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణాలకు ఆటంకాలు కలిగిస్తున్నాయి. కనురెప్ప పడితే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం సృషిస్తున్నాయి. నగరంలో ఆనందపురం నుంచి లంకెలపాలెం వరకు జాతీయ రహదారి ఉంది. ఎక్కడా హైవే మధ్యలో డస్ట్‌బిన్లు లేవు. మద్దిలపాలెం రహదారికి వచ్చేసరికి మాత్రం రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్లు దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారిలో రయ్‌మని వెళ్లే వాహనాలు నుంచి ఎవరు చెత్త వేస్తారో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసిన వారికే తెలియాలి. సత్యం కూడలి నుంచి మద్దిలపాలెం వెళ్లే రహదారిలో కాకతీయ ఫంక్షన్ హాలు వద్ద డస్ట్‌బిన్ ఉంది.

మళ్లీ మద్దిలపాలెం కూడలి నుంచి ఆటోమోటివ్ జంక్షన్ వెళ్లే రోడ్డులో శర్వాని స్వీట్ స్టాల్ దరిలో డస్ట్‌బిన్ ఉంది. సత్యం, మద్దిలపాలెం సిగ్నల్స్ విడిచిపెట్టినప్పుడు వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. వేగంగా వచ్చే వాహనాలకు రోడ్డు మధ్యలో ఉన్న డస్ట్‌బిన్లు ఆటంకం కలిగిస్తున్నాయి. పొరపాటున ఆదమరిస్తే అంతే సంగతులు. వాహనాలు డస్ట్‌డిన్లకు ఢీకొట్టి ప్రమాదాలకు గురికావాల్సిందే. చైతన్యనగర్ అరవై రోడ్డులో మరీ దారుణంగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేశారు. రెండు వాహనాలు వెళ్లెగలిగే విశాలమైన రోడ్డు సెంటర్‌లో డస్ట్‌బిన్ పెట్టారు.

దీంతో వాహనదారులు డస్ట్‌బిన్ తప్పించుకుని వెళ్లడానికి నానాయాతన పడుతున్నారు. పెద్ద కార్లు అయితే డ్యామేజ్‌కు గురవుతున్నాయి. ఒక్క 23వ వార్డు పరిధిలోనే రహదారి మధ్యలో డస్ట్‌బిన్లు పెట్టడం విశేషం. కొన్ని నెలలుగా వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నా డస్ట్‌బిన్లు జీవీఎంసీ సిబ్బంది పక్కకు పెడతారో ఇలానే వదిలేస్తారో అర్థం కావడం లేదని స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



శర్వాణీ స్వీట్‌స్టాల్ వద్ద..

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకుసాగుదాం

» డీఆర్‌ఎం లలిత్ బొహ్రా » పలు చోట్ల రాజ్యాంగ దినోత్సవం


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం గొప్పదని, దేశ పౌరులందరూ రాజ్యాంగం స్ఫూర్తితో మెలగి ముందుకు సాగాలని డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. వాల్తేరు రైల్వేలో భారత రాజ్యాంగ దినోత్సవ (సంవిధాన్ దివస్) కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఎం కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా హాజరై ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నివాళి అర్పించి రాజ్యాంగ విలువలపై ప్రసంగిస్తూ రోజువారీ జీవితంలో ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యానికి సమాజంలోన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం పాటించడం ద్వారా దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. మన రాజ్యాంగం, మన గౌరవం (హమారా సంవిధాన్, హమారా సమ్మాన్) థీమ్‌తో డివిజనంతా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం రాజ్యాంగ విలువపై అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో..

అక్కయ్యపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాధాకుమారి రాజ్యాంగ దినోత్సవం విశిష్టత విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్‌కుమార్, ఎంఎస్‌వీ విశ్వనాథం, అప్పారావు, శ్రీనివాస్, ప్రభాకర్, జ్యోతి, రత్నం, శ్యామల, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో..

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలో గల ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులంతా నివాళులు అర్పించి రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేశారు.


అక్కయ్యపాలెం : ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యారులు


సీతంపేట : అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలు

» భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు » ప్రత్యేక పూజలు, అభిషేకాలు


సీతమ్మధార : షిర్డీ సాయిబాబా ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు


సీతంపేట : పూజలందుకుంటున్న వల్లీదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి


కంచరపాలెం : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీతంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతంపేట పార్వతీశ్వరాలయం, నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పూజలను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలు, పాలతో అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో తెల్లవారుజామున 108 క్షీర కలశాలతో అభిషేకాన్ని ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ, శివాజీ శర్మలు చేపట్టారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా వేదమంత్రలతో జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలో పాల్గొన్నారు.

సీతమ్మధారలో..

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో గల వినాయక, షిర్డీ సాయిబాబా, వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో గల సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలను జరిపారు. సుబ్రహ్మణ్య స్వామికి గంధం పూతతో సుందరంగా అలంకరించారు.

అక్కయ్యపాలెంలో..

అక్కయ్యపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డులో వేంచేసిన పుట్టబంగారమ్మ ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వామివారికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మిషన్ కర్షక దేవోభవ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆడారి కిశోర్‌కుమార్ హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత పీలా నీల తిలక్, బొడ్డేటి మోహన్, శ్రీదేవి, పిళ్లా గోపి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవం సందర్భంగా జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-1 ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం జరిగింది.

కమిటీ గౌరవాధ్యక్షుడు గొండు సీతారాం, అధ్యక్షుడు బైరి చిరంజీవి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభిషేకాలు, విశిష్ట అలంకరణ,ఊంజల్ సేవ తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా చేపట్టామన్నారు. ఉత్సవాల్లో బియ్యంరాజ్, తెరపల్లి రంగారావు, మారుతి హరీష్, ఎంవీ సత్యనారాయణ, అర్చకులు హేమసుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

మాధవధారలో..

మాధవధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) ; సింహాచల దేవస్థానం ఉపదేవాలయమైన మాధవధార కొండమీది శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వల్లి దేవసేన సహిత శరవణ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ చేతుల మీదుగా కల్యాణం జరిపారు. పరిసర ప్రాంతాల భక్తులు ఉత్సవంలో హాజరయ్యారు. వేడుకల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పాలాభిషేకం నిర్వహించారు.

'నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఎల్‌ఐసీ బిల్డింగ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు కార్మికుల జీవితాలు, హక్కులు, గౌరవంపై విధ్వంసక దాడి వంటివన్నారు. తరతరాలుగా కష్టపడి సాధించిన కార్మికులు హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లు రూపొందించిన నాటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు కామేశ్వరి, మీడియా ఇన్‌చార్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీఈఎల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో 76వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సిబ్బందితో కలిసి ప్రాజెక్ట్స్, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ టి.వనజ భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు.

ప్రైవేటుకు ఫ్లాట్ ఉత్పత్తుల తయారీ

... 5వ పేజీ తరువాయి

ఎక్కువ. మంచి రేటు కూడా లభిస్తుంది. ఇక్కడే యంత్ర పరికరాలకు చిన్న చిన్న మార్పులు చేసుకుంటే వాటిని ఉత్పత్తి చేయవచ్చు. కానీ ఎవరికో లబ్ధి చేకూర్చడానికి ఈ టెండర్లు పిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతా, రూర్కెలాలో ఉండేవారు ఈ ఫ్లాట్లు కన్వర్షన్ చేయాలని స్టీల్ ప్లాంటు ప్రకటన జారీచేసింది. కనీసం ఏడాదికి ఆరు వేల టన్నుల బిల్లెట్లను కన్వర్షన్ చేయాలనేది నిబంధన. ఏడాదికి సగటున రూ.84 లక్షల టర్నోవర్‌తో మూడేళ్ల వ్యాపారం చేసి ఉండాలని పేర్కొన్నారు. ఫ్లాట్ల తయారీ మంచి నిర్ణయమే కానీ వాటిని ఇక్కడ తయారు చేయకుండా వేరే వారికి ఇవ్వడం వెనుక ఏదో మతలబు ఉందని ఉద్యోగ వర్గాలు అనుమానిస్తున్నాయి. కొద్దినెలల క్రితం ప్లాంటులో వైర్ రాడ్ మిల్లు ఉండగా, వాటిని తయారు చేయడానికి కూడా ఇలాగే ఒక సంస్థకు మూడేళ్ల కాంట్రాక్టు రూ.200 కోట్లకు ఇచ్చారు.

పట్టాలెక్కని అభివృద్ధి!

... 5వ పేజీ తరువాయి

ఆమోదం ఇస్తామని చెప్పారు. దాంతో 14 ప్లాట్‌ఫారాలతో కొత్త ప్లాన్ పంపించారు. ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు.

యార్డ్ రీ మోడలింగ్

కొత్త ప్రతిపాదనల్లో రైల్వే యార్డ్‌ను ఆధునికీకరిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్లకు సౌలభ్యంగా ఉండేలా, రైళ్లు వచ్చి, పోయేందుకు అనువుగా యార్డ్‌లో మార్పులు చేస్తారు. అదేవిధంగా 20 ఎస్కలేటర్లు, 20 లిఫ్ట్‌లకు బదులుగా 36 లిఫ్ట్‌లు, 24 ఎస్కలేటర్లకు ప్రతిపాదించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ర్యాంపుల నిర్మాణాలు జోడించారు. ఈ మార్పులకు ఆమోదం లభించిన వెంటనే పనులు వేగవంతం చేసి 18 నెలల్లో పూర్తిచేసి 2027లో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అంచనాలు పక్కాగా...

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు భాగస్వాములైతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వరుదు కల్యాణి మాట్లాడుతూ కేజీహెచ్‌లో ఇటీవల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడానికి గల కారణాలేమిటని ప్రశ్నించారు. అక్కడ సరిపడా జనరేటర్లు లేవా?... అంటూ అధికారులను అడిగారు. సంబంధిత అధికారులు వివరాలు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ అధ్వర్యంలో ఉందని, దానికింద ఆయకట్టు అంతగా లేదని, అందువల్ల జీవీఎంసీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నామన్నారు. రిజర్వాయర్ మరమ్మతులకు తగిన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో శాసనసభ డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ సుధాసాగర్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, బ్యాంకు అధికారులు

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 14, 24, 25, 26 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారుల కోసం ఏపీ డిడ్కో ఇల్లు లోన్ ప్రాసెస్ కార్యక్రమం సంస్థలతో నిర్వహించారు.లబ్ధిదారుల రుణ దరఖాస్తులను పరిశీలించడంతో పాటు సిబిల్ సమస్యలు ఉన్న లబ్ధిదారులకు బ్యాంకులు ఏ కారణాల వల్ల లోన్ మంజూరు చేయలేకపోతున్నాయో వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ లబ్ధిదారులందరి సమస్యలను శ్రద్ధగా పరిశీలిస్తున్నామని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, ఏపీడీశ్రీరాము, బ్యాంకుఅధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు స్వర్ణ, రజత పతకాలు



విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బీవీఎస్కే. లింగేశ్వరరావు స్వర్ణ, రజత పతకాలు సాధించాడు. థాయ్‌లాండ్‌లో జరిగిన సవాస్డీ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన లింగేశ్వరరావు 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకం, పురుషుల డబుల్స్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. టర్కీ, డెన్మార్క్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ టోర్నీలోనే కాకుండా ఇప్పటి వరకూ అనేక అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన లింగేశ్వరరావు... బుధవారం థాయ్‌లాండ్‌లో జరిగిన సవాస్డీ కప్‌లో సత్తా నిరూపించుకొని పతకాలు సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా నగరానికి చెందిన సీనియర్ షట్లర్లు, కోచ్‌లు అభినందనలు తెలిపారు.

రికార్డులు లేని 11 బైక్‌లు సీజ్

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రికార్డులు సక్రమంగా లేని 11 ద్విచక్ర వాహనాలను మహారాణిపేట పోలీసులు బుధవారం సీజ్ చేశారు. స్టేషన్ ఆఫీసర్ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం దండుబజారు, అంగటిదిబ్బ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలను తనిఖీలు చేసి, రికార్డులు పరిశీలించారు. రికార్డులు, నెంబరు ప్లేట్‌లు సక్రమంగా లేని 11 వాహనాలను సీజ్ చేశారు.






అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మహిళా కళాశాల అధ్యాపకులు



రక్తదానం చేస్తున్న యువత

హక్కులే కాదు.. బాధ్యతలూ తెలుసుకోవాలి

భారత రాజ్యాంగం దినోత్సవంలో వక్తలు

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులు ప్రిన్సిపాల్ మంజుల ఆధ్వర్యంలో కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ మహనీయుడని కొనియాడారు. ఆయన బాటలో యువత నడవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్ ఏక్యూ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు నాగమణి, జ్యోతి, గీతాంజలి, శిరీష, అనురాధ పాల్గొన్నారు.

జై భీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ రక్షించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. జై భీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓ హాల్‌లో రాజ్యాంగ దినోత్సం నిర్వహించారు. జై భీమ్ కన్వీనర్ కోన ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని చెప్పారు. డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి, యువత, పెద్దలు రాజ్యాంగం చదవాలన్నారు. అనంతరం సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్, లూథర్‌బాబు, భూపతిరావు, జంగం జోషి, తిరుపతిరావు, కోన శంకర్, లక్ష్మణ్, గణేశ్, జయరాజ్, రమ్య, రూప, వెంకట రత్నం, కృప, తదితరులు పాల్గొన్నారు.

14న కాపు నేత మిరియాల వెంకట్రావు జయంతి

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాపుల అభ్యున్నతికి కృషి చేసిన మిరియాల వెంకట్రావు 86వ జయంతి వచ్చే నెల 14న నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ సభ్యులు పసుపులేటి ఉషాకిరణ్, పసుపులేటి శేఖర్ తెలిపారు. బుధవారం వారు డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14న వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 10 నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి ఇండియన్ ఆర్థోడాంటిక్ సమావేశాలు

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో 59వ ఇండియన్ ఆర్థోడాంటిక్ సమావేశాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్నట్టు ఇండియన్ ఆర్థోడాంటిక్ కాన్ఫరెన్స్ నిర్వాహక కమిటీ చైర్మన్ శ్రీకృష్ణ చలసాని తెలిపారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 28న సాయంత్రం ఐదు గంటలకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై సమావేశాలను ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా ఎంపీ శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పునీత్ బాత్రా, తెలంగాణ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ సంజయ్‌లాబ్ హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆర్గనైజింగ్ కోచైర్మన్ డా. డీఎస్ రాజు, డా. కె. విజయ్ కుమార్‌రాజు, ఆర్గనైసింగ్ సెక్రటరీ డా.ఎస్.ఎస్. రాజు, కోశాధికారి డా. గోరంట్ల సురేశ్, సైంటిఫిక్ కమిటీ కో కన్వీనర్ డా. అనిల్ చీరాల, డా. రవీంద్ర వంగల, తదితరులు పాల్గొన్నారు.


చందకవీధిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కల్యాణంలో స్వామివారి ఉత్సవమూర్తులు

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 29వ వార్డు చందకవీధిలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పూజలు, కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ ఊరుకూటి రామకృష్ణ ఆధ్వ ర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. తొలుత స్వామివారికి పాలాభిషేకం, పూజలు జరిపి, అనంతరం కల్యాణం నిర్వహించారు, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే డాబాగార్డెన్స్ టూ టౌన్ ఎదురుగా ఉన్న శివరామకృష్ణ దేవాలయంలో కూడా సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలయ ఈవో సురేశ్ బాబా సారథ్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో అర్చకులు స్వామివారికి అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

... 5వ పేజీ తరువాయి

ఎంసీఏ కోర్సులకు సంబంధించి మొదటి, రెండు, మూడో సెమిస్టర్‌లతోపాటు 2019 నుంచి గత విద్యా సంవత్సరం వరకూ ఉన్న బ్యాక్‌లాగ్స్‌కు ఈ నెల 25 నుంచి పరీక్షలు నిర్వహిస్తోంది. ఇటు శ్రీకాకుళం నుంచి అటు గుంతకల్లు వరకూ 78 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఈ పరీక్షలకు పది వేల మందికిపైగా హాజరవుతున్నారు. అయితే పరీక్ష కేంద్రాలుగా ఉన్న కొన్ని కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నాయి. కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ నిర్వాహకులు డబ్బులు చెల్లించిన విద్యార్థులకు మాత్రమే ప్రశ్నపత్రాలను పంపినట్టు తెలిసింది. అదేవిధంగా వారందరినీ ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చోబెట్టి పరీక్షలు రాయించినట్టు చెబుతున్నారు. విద్యార్థులు ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాసిన వెంటనే మైక్రో జెరాక్స్‌లను అక్కడ నుంచి తీసుకువెళ్లేలా ఆయాలను ఏర్పాటుచేసినట్టు తెలిసింది. పరీక్ష ప్రారంభమైన గంట మాత్రం జాగ్రత్తగా ఉండాలని, ఆ తరువాత మైక్రోజెరాక్స్‌లు తీసుకుని రాసుకోవాలని చెప్పినట్టు చెబుతున్నారు. ఇకపోతే, ఇదే కాలేజీకి చెందిన బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులకు సంబంధించి కూడా సెల్ఫ్ సెంటర్‌ను వేయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. దూరవిద్యకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు కాస్త ముందు పంపినట్టయితే అక్రమాలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం

- దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ డీఏ నాయుడు

డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, తనిఖీలు నిర్వహిస్తున్నామని దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలను ఏయూ నుంచి వెళ్లిన స్క్వాడ్ తనిఖీ చేయగా, ఎనిమిది మంది విద్యార్థులు పట్టుబడ్డారన్నారు. వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. అందులో ఏడుగురు చూచిరాస్తుండగా, ఇంకొకరు... వేరొకరి బదులు పరీక్ష రాస్తున్నట్టు గుర్తించడం జరిగిందన్నారు.

రేషన్ డిపోల్లో సీసీ కెమెరాలు

... 5వ పేజీ తరువాయి

కోరుతున్నారు. పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి ప్రతి నెలా సరకులను డిపోలకు సరఫరా చేస్తారు. అయితే ప్రతి బస్తాలో కిలో నుంచి రెండు కిలోల బియ్యం తక్కువగా ఉంటున్నట్టు డీలర్లు చెబుతున్నారు. అందువల్ల తొలుత గోదాముల్లో అక్రమాలు అరికట్టేందుకు అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని డీలర్లు కోరుతున్నారు. అలాగే డీలర్లకు ప్రతి కిలోకు ఇప్పుడు ఇస్తున్న రూపాయి కమీషన్‌ను మూడు రూపాయలకు పెంచాలని అడుగుతున్నారు. అక్రమ బియ్యం కొనుగోలు చేసే రైస్‌మిల్లుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాల్సి ఉంది.

కుమార్తె పెళ్లి ఆగిపోవడంతో తండ్రి ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

ముహూర్తం పెట్టుకున్నారు. కుమార్తె పెళ్లికి సంబంధించి బంధువులు, స్నేహితులకు కార్డులు పంపిణీ చేయడంతోపాటు ఏర్పాట్లన్నీ శ్రీనివాసరావు పూర్తిచేశారు. ఇంతలో ఏమైందోగానీ పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్టు పెళ్లి కుమారుడి తరపువాళ్లు శ్రీనివాసరావుకు చెప్పారు. దీంతో ఆయన పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లి పెళ్లి రద్దు చేసుకోవద్దని కాళ్లావేళ్లాపడి వేడుకున్నారు. కానీ వారి నిర్ణయం మారకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. విజయనగరంలో పెళ్లికి వెళుతున్నానని తల్లికి చెప్పి మంగళవారం (ఈనెల 25) రాత్రి ఏడు గంటల సమయంలో శ్రీనివాసరావు ఇంటి నుంచి బయటకు వచ్చిన చేరలేదు. బుధవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఒకరు సత్యవతికి ఫోన్ చేసి 'మీ కుమారుడి కారు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద సర్వీసు రోడ్డులో ఉంది. ఆయన చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉందని' సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె గాజువాకలో ఉంటున్న తన అల్లుడు, కుమారుడి బావమరిదికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వెళ్లారు. కాగా శ్రీనివాసరావు తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యానని హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడితోపాటు గాజువాకలో ఉంటున్న సోదరి భర్త, తన బావమరిదికి, స్నేహితుడికి సూసైట్‌నోట్‌ను వాట్సాప్‌లో పంపించారు. మృతుడు శ్రీనివాసరావు తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనూష

చెరువు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజలు పార్టీలకు అతీతంగా సహకరించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. అక్కిరెడ్డిపాలెంలోని మల్లమ్మ పేరంటాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆదునిక విద్యుత్ దీపాలంకరణను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు, సామాజిక భవనాలు వంటి ఆస్తులను ప్రజలు బాధ్యతగా సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి భాగవత సప్తాహం

వేపగుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్‌లో ఉన్న శ్రీబాలత్రిపురేశ్వరి పీఠంలో బ్రహ్మశ్రీ వేదమూర్తి, ఆగమశాస్త్ర పండితుడు దివాకరుణి రామచంద్ర శేఖర్ శర్మ ఆధ్వర్యంలో గురువారం నుంచి డిసెంబరు 3 వరకు పీఠంలో భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటన ద్వారా తెలిపారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చిమలపాటి వెంకటరమణ మూర్తి చేప్పనున్నారని తెలిపారు. ప్రవచనాలు ప్రతి రోజు సాయంత్రం 6:30 నుంచి రాత్రి 8:30 వరకు నిర్వహిస్తారని ప్రకటనలో తెలిపారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాయడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అలంకరణ చేశారు. మధ్యాహ్నం దాదాపు 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అలాగే 90వ వార్డు ఎన్ఏడీ విమాన్ నగర్‌లో కొలువైన శ్రీవైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి 'జాతీయ దత్తత అవగాహన సదస్సు'

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతులకు పిల్లల దత్తతపై అవగాహన పెంచేందుకు రాష్ట్రంలో నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్-2025 (జాతీయ దత్తత అవగాహన సదస్సు) నిర్వహించనున్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సహకారంతో ఈ నెల 27, 28వ తేదీల్లో నగరంలో కార్యక్రమం జరగనుంది. సదస్సులో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు తమ జీవిత అనుభవాలను పంచుకుంటారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 50, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 30,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 56, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216


సింధియా: స్వామివారి ఊరేగింపులో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


కుర్మన్నపాలెం: ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యుడు


అగనంపూడి: పూజలందుకున్న కార్తికేయుడు


అక్కిరెడ్డిపాలెం: సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

- పలు ఆలయాల్లో వైభవంగా సుబ్రహ్మణ్యుడి కల్యాణం
- గాజువాక, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో పోటెత్తిన భక్తులు

గాజువాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పాతకర్ణవానిపాలెం రామాలయంలో బుధవారం సుబ్రహ్మణ్య స్వామి షష్ఠిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని కనుల పండుగగా జరిపించారు. బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కరణం రెడ్డి నరసింగరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వామివారికి ఎమ్మెల్యే గణబాబు పూజలు

గోపాలపట్నం: సుబ్రహ్మణ్యయ షష్ఠిని పురస్కరించుకుని గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు దంపతులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ప్రారంభించారు. సాయంత్రం జగిరిన ఊరేగింపులో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డు న్యూకాలనీలో

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు సింధియా షిప్‌యార్డు న్యూకాలనీలో ఉన్న పాత శివాలయంలో బుధవారం అత్యంత వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి నిర్వహించారు. మాలాధారనతో భక్తులు, పాలకుండలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనగంపూడిలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాతఅగనంపూడి పిల్లేలమ్మ కొండపై వెలిసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సుబ్రహ్మణ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఎన్ఏడీ జంక్షన్..

ఎన్ఏడీజంక్షన్: జీవీఎంసీ 52వ వార్డులోని ఎన్ఏడీలో కొలువైన సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం వేడుకగా చేశారు. ఈ కల్యాణంలో దాదాపు 150 జంటలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటల సమయంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు కనుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో విశ్వేశ్వర దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలో ఉన్న పంచముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే త్రిశక్తి ఆలయంలో నెలకొన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరం గా అలంకరించారు. అలాగే కణితి, తోకాడ, ఆటోనగర్, కూర్మన్నపాలెంలో శివసాయి నగర్, సిద్ధార్థ నగర్, చట్టివానిపాలెంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయా ల్లో షష్ఠిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

పెందుర్తిలో..

పెందుర్తి: చినముషిడివాడలో ఉన్న శారదాపీఠంలో సుబ్రహ్మణ్య షష్ఠిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నక్షత్ర హారతులిచ్చి, పంచామృతాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివానిరి ఆరాధిస్తే సకల గ్రహ దోషాలు తొలగి సుఖ, సంతోషాలు కలుగుతాయని పీఠాధిపతి సందేశానిచ్చారు. సాయంత్రం సుబ్రహ్మణ్య స్వామికి కాల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే వెంకటాద్రి శిఖరం దిగువన ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి ఘనంగా నిర్వవహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం నేత్రపర్వంగా కల్యాణం జరిపించారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ: నెల్లిముక్కు రామాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న నవనాగ పూర్వక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం బుదవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం జరిగింది.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం


పెదగంట్యాడ: మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న విద్యార్థి


మల్కాపురం: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న షిప్‌యార్డు అధికారి రాకేశ్‌ప్రసాద్


వేపగుంట: విద్యార్థికి బహుమతి అందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- నడుపూరు జడ్పీ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహణ
- పలు విద్యాసంస్థలు, గ్రంథాలయాల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

పెదగంట్యాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచదేశాలకే ఆదర్శమని పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజీ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నడుపూరు జడ్పీ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో అనేక మతాలు, కులాలు, వర్గాలు విభిన్న సంస్కృతులు ఉన్నాయని వాటి అన్నింటి రాజ్యాంగం రక్షణగా నిలుస్తోందన్నారు. అనంతరం హైస్కూల్ హెచ్ఎం రాజకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, పలుశాఖల మంత్రులు, శాసనసభాపతి వంటి పాత్రలు పోషించారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టడం, దాన్ని ఆమోదించడం, సభ్యుల వాగ్వివాదాలు వంటి ఘట్టాలు కళ్లకుకట్టినట్టు ప్రదర్శించారు. రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించే యమదర్మరాజు అనే లఘునాటికను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో బుధవారం రాజ్యాంగదినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వీవీ రమణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో వేడుకలు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రజా కవి, సాహితివేత్త టి.శ్రీరామ్మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాధించుకున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఉక్కుటౌన్‌షిప్: రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగి, సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని స్టీల్‌ప్లాంట్ జీఎం(హెచ్ఆర్)ఎన్.భాను అన్నారు. స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. భారత దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అతి గొప్పదని, విశేష స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డులో..

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డులో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అధికారి రాకేశ్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షిప్‌యార్డు అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో...

భారత రాజ్యంగ లక్ష్యాలను, విశిష్టతను యువత తెలుసుకోవాలని వాటిని ప్రజలకు వివరించాలని జాతీయ సేవా పథకం నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలను ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని అన్నారు. రాజ్యాంగ నిర్మాణం గురించి జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవీ వివరించారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగంపై క్విజ్‌ను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

కూర్మన్నపాలెం వార్డుల్లో..

కూర్మన్నపాలెం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1949 నవంబరు 26న భారత దేశానికి దిశా, నిర్దేశాన్ని తెలిపే రాజ్యాంగాన్ని అందించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడి, కణితి, అంబేద్కర్ నగర్‌లో బుధవారం అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే కూర్మన్నపాలెం దగ్గర ఉడానగర్, కణితి సిద్ధార్థ నగర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు ఎస్సీ, ఎస్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతుల ప్రధానం

వేపగుంట: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు రాజ్యాంగ దినోత్సవవేడుకల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో వేపగుంట హైస్కూల్‌కు చెందిన దాట్ల సాయి మానస విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా సాయి మానసకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బహుమతిని అందజేశారు. విద్యార్థులకు అవార్డులు రావడంలో కృషి చేసిన సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, సాయిమానసను డీఈవో ప్రేమ్‌కుమార్ అభినందించారు.

పెందుర్తిలో..

పెందురి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని వాలిమెరక జుత్తాడలో వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మువ్వల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో సర్పంచ్ చంద్రబాబి ప్రకాశ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏయూ ప్రొఫెసర్ టి.సుబ్బారాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అగనంపూడి జంక్షన్‌లో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం జంక్షన్‌లో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంఘం బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జీ-20 పనులపై విజిలెన్స్ విచారణ

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీ-20 సదస్సు సందర్భంగా 2023లో జీవీఎంసీ చేపట్టిన సుందరీకరణ పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆయా పనులపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విచారణకు అనుమతించిందని, ఆయా పనులను పరిశీలిచేందుకు సంబధిత అధికారులను తమకు సహకరించేలా ఆదేశించాలని జీవీఎంసీ కమిషనర్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ కె.ప్రభాకర్ లేఖ రాశారు.

రహదారిపై మురుగు

గాజువాక ,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు మెహర్‌నగర్‌లో కాలువలు మరమ్మతులకు గురవడంతో మురుగనీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు రోడ్డుపై ప్రవహిస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి గాజువాకలో పలు వార్డుల్లో సర్వసాధారణం అయిపోయింది. చాలా చోట్ల డ్రైనేజీలు శిథిల స్థితిలో ఉన్నాయి. రోడ్డుపై మురుగు ప్రవహించడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్న దృశ్యం

37 మంది పోలీసులకు బదిలీలు

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 37 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురు ఏఎస్ఐలు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కొత్త స్టేషన్లలో వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి


ప్రధాన రహదారిలో పూడ్చకుండా వదిలిపెట్టిన గొయ్యి

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జంక్షన్ మెయిన్ రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా పైప్‌లైన్ మరమ్మతులు నిమిత్తం కార్పొరేషన్ కార్మికులు పెద్ద గొయ్యి తవ్వి వదిలేశారు. నీరు లీకేజీని అరికట్టేందుకు గోతిని తవ్వి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు చేపట్టి వారం గడుస్తున్నా ఇంకా పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో ఆ గొయ్యి అలానే ఉండిపోయింది. అసలే ఇది మేయిన్ రోడ్డు, వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. పొరపాటునా ఈ గోతిలో వాహనం పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పలువురు వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గోతిని పూడ్చేయాలని కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

- భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం డిమాండ్

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని బెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సాహూ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ బెల్ హెచ్‌పీవీపీలో బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కంపెనీ మెయిన్ గేటు ఎదురుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్మిక వ్యతిరేక చర్యల పట్ల కార్మికులను చైతన్యవంతం చేసి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో...

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం తలపెట్టిన సమ్మె సఫలమైంది. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డు, నేవల్ డాక్‌యార్డు హెచ్‌పీ గ్యాస్ కంపెనీ, ఐటీసీ కంపెనీల వద్ద సీఐటీయూ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, కార్పొరేటర్ పీవీ సురేశ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం కార్మికుల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

కార్మిక వర్గాలను విడదీసేందుకు కుట్ర

- ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గాలను విడదీసేందుకు కుట్ర జరుగుతోందని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. లేబర్ కోడ్స్ అమలుచేసిన క్రమంలో వీటిని నిరసిస్తూ బుధవారం ప్లాంట్ అడ్మిన్ భవనం మార్గంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గంపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్మిక వర్గమే దేశ ఆర్థిక ప్రగతికి మూలమని, అయితే కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శిస్తున్నాయన్నారు. పని ప్రదేశంలో కూడా బానిసలుగా ఉండాల్సిన పరిస్థితి పట్టిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వ రంగంలోనే అన్నివర్గాలకు ఉపాధితో పాటు నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

తప్పని ప్రయాణ కష్టాలు


మట్టి దిబ్బలమీద నుంచే ప్రయాణం సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం ప్రాంత వాహనదారులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఇంతకుముందు సర్దార్ పటేల్ వంతెన పనుల వల్ల ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు డాక్‌యార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన దాటిన వెంటనే కాన్వెంట్ వంతెన పైకి వెళ్లే ముందు దారిలో మరమ్మతులు ప్రారంభించారు. మరమ్మతుల కారణంగా నల్లడి మట్టిదిబ్బలు రోడ్డుకు అడ్డంగా పోశారు. ఈ నేపథ్యంలో మార్గమంతా పూర్తిగా దుమ్ముతో నిండిపోయింది. రహదారిలో మట్టి దిబ్బలు వేశారని తెలియక అనేక మంది వాహనదారులు ఈ మార్గంలో వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మట్టి దిబ్బలపైనుంచే తమ వాహనాలను తీసుకువెళుతున్నారు. వర్షం కురిస్తే కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లడం కూడా కష్టమే. పెట్రోల్ బంక్ వెనుక నుంచి డాక్‌యార్డు క్వార్టర్స్ మీదుగా రామ్మూర్తి పంతులపేట వరకు చేరుకుని అక్కడి నుంచి కాన్వెంట్‌కు చేరుకుంటున్నారు. అంతేకాకుండా మూడు రైలు గేట్లు కూడా ఉన్నాయి. ఈ గేట్లు ఎప్పుడు పడతాయో? ఎప్పుడు పడవో? తెలియని పరిస్థితి. నూతన వంతెన ప్రారంభమైనా తమకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో మండల రీసోర్స్ సెంటర్


శిథిలమై నిరుపయోగంగా మారిన మండల రీసోర్స్ సెంటర్

పెదగంట్యాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండల రీసోర్స్ సెంటర్ శిథిలమై నిరుపయోగంగా మారింది. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనానికి సకాలంలో మరమ్మతులు చేపట్టక పోవడంతో భవనం శిథిల స్థితిలో ఉన్నది. ఈ సెంటర్ ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ళపొదలు పెరిగిపోయాయి. వీటిలో పాములు ఇతర విషకీటకాలు చేరతాయని పరిసర ప్రాంతాల వారు భయపడుతున్నారు. ఎంఆర్‌సీ సెంటర్ శిథిలమై కూలిపోయే స్థితిలో ఉండడంతో దీనిలో ఉన్న ఎంఈవో కార్యాలయాన్ని నెల్లిముక్కులో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలోకి మార్చారు. ఇప్పుడు పాఠశాలలోని అయిదు గదుల్లో ఎంఈవో కార్యాలయం నడుస్తోంది. మండల రిసోర్స్ సెంటర్ పరిస్థితిని గతంలో విద్యాశాఖాధికారులకు వివరించారు. ఈ రిసోర్స్ సెంటర్ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటి ఇంద్రజ


ఆలయంలో సినీ నటి ఇంద్రజ

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం సినీ నటి ఇంద్రజ దర్శించుకున్నారు. బేడామండపంలో పలు స్తోత్రాలను పఠించారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని అంతరాలయంలో స్వామికి పూజలు చేయించుకున్నారు. గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు. కొందరు భక్తులు ఇంద్రజతో సెల్ఫీలు తీసుకున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, శాసనసభ కమిటీ సభ్యులు


జిల్లా పరిషత్‌లో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, అధికారులు రాజ్యాంగ పీఠికను చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన 13 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవో సుధాసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, శాసనసభ అంచనాల కమిటీ సభ్యులు ఏలూరి సాంబశివరావు, నిమ్మక జయకృష్ణ మద్దిపాటి వెంకటరాజు, పెన్మత్స సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు

జిల్లా పరిషత్ కార్యాలయంలో...

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ కార్యనిర్వాహక అధికారి కె.రాజ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు

కేజీహెచ్‌లో...

కింగ్ జార్జి ఆస్పత్రి పరిపాలనా విభాగంలో సూపరింటెండెంట్ ఐ.వాణి అంబేడ్కర్ చిత్రటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వైద్యాధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, డాక్టర్ ఎం.శ్రీహరి, డాక్టర్ బంగారయ్య డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీలో...

ద్వారకాబస్‌స్టేషన్: ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ద్వారకాబస్‌స్టేషన్‌లోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం అప్పలనాయుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగానికి ఎల్లప్పుడూ విధేయత కలిగి ఉంటానని ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. అధికారులు తిరుపతి, శ్రీధర్, సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే ఉత్సవాలు విజయవంతం

» శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు


సమీక్ష సమావేశంలో శాసనసభ అంచనాల కమిటీ సభ్యులు

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ఆలయాల్లో ముఖ్యమైన ఉత్సవాలు విజయవంతం కావడానికి ముందస్తు ప్రణాళికలు అవసరమని అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అప్పన్నస్వామి చందనోత్సవం సందర్భంగా గోడకూలి భక్తులు మృతి చెందిన ఘటనపై కమిటీ స్పందించింది. కమిటీ సభ్యులు బుధవారం స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సింహగిరి సమావేశ మందిరంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, దేవస్థానం పరిధిలో పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించి చేతులు దులుపుకోవడం సరికాదని హితవు పలికారు. మూడేళ్ల దేవస్థానం బడ్జెట్ అంచనా, ఖర్చులపై ఆరా తీశారు. దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించిన సౌకర్యాలపై చర్చించారు. దేవస్థానం భూ వివాదం న్యాయస్థానం పరిధిలో ఉందని, జీఎస్టీ మినహాయింపుపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. సమావేశంలో కమిటీ చైర్మన్ జోగారావు, సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ డా.వీవీ సూర్యనారాయణరాజు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, తహశీల్దార్ పాల్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై భక్తులకు మరిన్ని సౌకర్యాలు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు గంటా, గణబాబు

సింహాచలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పన్న భక్తులకు సింహగిరిపై మరిన్ని సౌకర్యాలను అందుబాటులో తెస్తున్నామని భీమిలి, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు తెలిపారు. చైతన్య విద్యాసంస్థల అధినేత డా.బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి రూ.3 కోట్ల ఆర్థిక సాయంతో నిర్మించిన ప్రత్యేక షెడ్డును బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్డు నిర్మాణంతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు వంచి వసతి కల్పించినట్టయిందన్నారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో వాస్తు హోమం, శాంతిహోమం, సుదర్శన నారసింహ హవనాలను పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రధాన వేదికపై సుదర్శన పెరుమాళ్‌ను ఉంచి బింబారాధన, కలశారాధన, మండపారాధనలు, పూర్ణాహుతి జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో ఎస్.సుజాత, చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు బి.రమణ, ఎంవీ సురేశ్, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు, డీఈఈ రామరాజు, ఏఈఓ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పీవీ నరసింహం, టీడీపీ నేత పంచదార్ల శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

లేబర్ కోడ్స్ అమలుపై కార్మిక సంఘాల నిరసన

» జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

సిరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ అమలు ఉత్తర్వులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. స్టీల్‌ప్లాంటు యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను తాకట్టుపెట్టి, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఇవి అమలైతే సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యాన్ని నిలదీసే పరిస్థితి ఉండదని, వారి దయాదాక్షిణ్యాలపై పనిచేయాల్సిన పరిస్థితులు ఎదురవుతాయన్నారు. కార్పొరేట్ కంపెనీలు వనరులు దోపిడీ చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ, కష్టాన్ని నమ్ముకొని పనిచేసే కార్మికులను మాత్రం ఇబ్బందులకు గురిచేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి చర్యలను ప్రజా, కార్మిక సంఘాలు సమైక్యంగా తిప్పి కొట్టాలన్నారు. లేబర్ కోడ్స్ అమలు ఉత్తర్వులు రద్దుచేయకుంటే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు నాగభూషణం, వెంకటేశ్వరరావు, వాసుదేవరావు, కనకారావు తదితరులు ప్రసంగించారు. పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డిజిటల్ ఎల్ఈడీ డిస్‌ప్లే

ప్రారంభించిన డీఆర్ఎం లలిత్‌బోహ్రా


డిజిటల్ ఎల్ఈడీ డిస్‌ప్లే వద్ద డీఆర్ఎం, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సమాచారం అందించేందుకు విశాఖ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక డిజిటల్ ఎల్ఈడీ డిస్‌ప్లేను బుధవారం డీఆర్ఎం లలిత్ బోహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌లో 220 డిజిటల్ ఎల్ఈడీ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా రైల్వే సమాచారం, హెచ్చరికలు, అత్యవసర సందేశాలు, నవీకరణ కార్యాచరణ వంటి సమాచారం లభిస్తుందన్నారు. ప్రమాదాలు, విపత్తులు, తుపాన్లు, ఆందోళనలు జరిగిన సమయాల్లో ప్రయాణికుల భద్రతకు మెరుగైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, డీసీఎం పూజాసింగ్ తదితరులుపాల్గొన్నారు.

'అమరావతిలో టిట్టిభ సత్యాగ్రహం కొనసాగిస్తాం'


నిరసన తెలుపుతున్న తెలుగుదండు సభ్యులు

మద్దిలపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను కాపాడుకోవడానికి చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహాన్ని అమరావతిలో కొనసాగిస్తామని తెలుగుదండు వ్యవస్థాపకులు పరవస్తు సూరి తెలిపారు. ఈ మేరకు బుధవారం మద్దిలపాలెంలోని తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలు సమర్పించి అమరావతి బయలుదేరారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ వందేళ్ల కిందట మొదలైన ఆంగ్ల భాష మోజును స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మన పాలకులు కొనసాగించడం దౌర్భాగ్యమన్నారు. ఆంగ్లం చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని ప్రజల్లో వ్యాపించి మన భాషను, సంస్కృతిని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. తెలుగు భాషను పరిరక్షించి భావితరాలకు అందించడానికి ఉద్యమం చేస్తున్నామన్నారు. ప్రభుత్వంతోనే అమీతుమీ తేల్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, కేవీఎస్ మూర్తి, రాజమన్నార్, దేవిశ్రీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్, చెస్ టోర్నీ రేపు

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 28న జిల్లా స్థాయి పారా బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు నిర్వహించనున్నామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ తెలిపారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగే బ్యాడ్మింటన్ టోర్నీలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలో పోటీలుంటాయన్నారు. డబ్ల్యుహెచ్1, డబ్ల్యుహెచ్2, ఎస్ఎల్3, ఎస్ఎల్4, ఎస్‌యూ 5, ఎస్ఎస్6 కేటగిరీ దివ్యాంగులకు స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ఆసక్తి గలవారు 28న ఉదయం 8 గంటలకు గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలో హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు వచ్చే నెల 1,2 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. వివరాలకు 8309167670 నంబరులో సంప్రదించాలన్నారు.

అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు నియామక పత్రాలు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలో అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన 12 మందికి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు బుధవారం ఆర్ఎం కార్యాలయంలో నియామక ఉత్తర్వులు జారీచేశారు. డీజిల్‌మెకానిక్, వెల్డర్, పెయింటర్ ట్రేడుల్లో ఐటీఐ చేసిన వీరిని జిల్లాలోని వివిధ డిపోలకు కేటాయించారు. క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని, పనిస్థలంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధరరావు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగికి వేధింపులు


» తట్టుకోలేక స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల వేధింపులు భరించలేని కేజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ రెండేళ్ల సర్వీసును వదులుకుని మరీ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. దీనిపై కేజీహెచ్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి... కేజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని ఆస్పత్రిలోని కొందరు అధికారులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఆమె ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని, పనిచేయలేనని ఫిర్యాదు చేశారు. దీంతో ఓ ఉన్నతాధికారి పదవీ విరమణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. దీంతో సదరు ఉద్యోగి ఈ నెల 30న పదవీ విరమణ చేయబోతున్నట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ తరహా వేధింపులు తాళలేక మరో మహిళా ఉద్యోగి దీర్ఘకాలికి సెలవు పెట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు సూపర్‌బజార్ మహాజన సభ

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్‌బజార్) మహాజనసభ శనివారం సంస్థ ఆవరణలో జరగనుంది. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మహాజనసభకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు.

యారాడ కొండపై కారు దగ్ధం


మంటల్లో కాలిపోతున్న కారు

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యారాడ కొండపై ఉన్న తూర్పు నౌకాదళం ముఖ్యఅధికారుల నివాసప్రాంతాల సమీపంలో బుధవారం సాయంత్రం ఓ కారు దగ్ధమయింది. దీంతో నేవీ ఉద్యోగుల కుటుంబాలు ఆందోళన చెందాయి. సింధియా- నేవీ ఉద్యోగులు మాత్రమే వెళ్లే మార్గంలో పార్కింగ్‌లో ఉన్న నల్లని రంగు గల కారు నుంచి పెద్దఎత్తున మంటలు చేలరేగడంతో స్థానికులు భయాందోళన చెందారు. దీంతో రెండుమార్గాల్లో వాహనాలను నిలిపివేశారు. కొద్దిసేపటి అనంతరం అగ్నిమాపక శకటం ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసింది. ప్రమాదం ఎలా జరిగిందో నేవీ అధికారులు, పోలీసులు ఆరా తీస్తున్నారు.

జీవీఎంసీ ఎస్ఈగా ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా జి.ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కొంతకాలం కిందటివరకు సీఆర్‌డీఏలో పనిచేసిన ఆయన ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు.

నేటి ధర్నాకు అనుమతి లేదు: 'ఉక్కు' పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న ధర్నాకు ఎటువంటి అనుమతి లేదని స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే నాయకులకు తెలియజేశామని పేర్కొన్నారు. పోలీసుల తరపున ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, కానీ ధర్నా చేస్తామంటూ సోషల్ మీడియాలో ఉద్యోగులను ఆహ్వానిస్తున్నారని తెలిసిందన్నారు. అనుమతి లేని కార్యక్రమానికి హాజరై తదనంతర పరిణామాలకు బాధ్యులు కావద్దని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా కార్యక్రమానికి హాజరైన వారు బాధ్యులవుతారని పోలీసులు హెచ్చరించారు. ఇదిలావుండగా నిరసనలు తెలియజేసేందుకు పోలీసులు లేనిపోని ఆంక్షలు పెడుతున్నారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్మిక వర్గంపై ప్రస్తుతం దాడులు జరుగుతున్నాయని పేర్కొంటూ, ధర్నాకు భారీగా ఉద్యోగులు హాజరుకావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.